క్లుప్తంగా

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత క్రీడా శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: వేసవి శిక్షణ శిబిరాలు సద్విని యోగం చేసుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఉచితంగా నిర్వహి స్తున్న క్రీడ, యోగా పోటీలు శనివారం సాయం త్రం ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వ హించే వాలీబాల్, ఖోఖో, కబడ్డీ,యోగా, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ కీడల శిక్షణను సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. రిజిస్ట్రార్ సుమలత, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సెలవుపై జేసీ ఇలక్కియ

- ఇన్‌చార్జి జేసీగా మహేష్‌కుమార్



కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సెలవుపై వెళ్లారు. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆమె సెలవుపై వెళ్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు శనివారం రాత్రి తెలిపాయి. ఆమె స్థానంలో ఇన్‌చార్జి జేసీగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆయన శనివారం రాత్రి ఉత్తర్వులు అందుకున్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జెడ్పీ యాజమాన్యం పరిధిలో పని చేస్తూ సర్వీసులో ఉండగా మృతి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల వారసులు ముగ్గురికి కారుణ్య నియామకం కల్పిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లా వెంకటకిరణ్‌ను ముమ్మిడివరం ఎంపీపీ కార్యాలయంలో టైపిస్ట్‌గాను, సాగిరాజు సుబ్బరాజును కాకినాడ జెడ్పీ ఆఫీస్ సబార్డినేట్‌గా, తుంబుడు దయామణికి రంపచోడవరం ఎంపీపీ కార్యాలయ సబార్డినేట్‌గా నియమించారు. జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఎంపీపీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



అరట్లకట్టలో రైతులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

కరప: మండలం అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు మండలప్రత్యేకాధికారి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పర్యటించి రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్‌బీకేకి వచ్చిన రైతులకు దళారులతో మోసపోకుండా, మద్దతుధర పొందేలా అవగాహన కల్పించాలన్నారు. తర్వాత కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆర్బీకేకు వెళితే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ఏపీఓ ఇ.వెంకటరమణ పాల్గొన్నారు.

11 నుంచి బీజేపీ సభలు

బోట్‌క్లబ్: ప్రజా వ్యతిరేక పాలనపై ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సభలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు తెలిపారు. కాకినాడలోని ఒక హోటల్‌లో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభల అనంతరం 12న అన్ని పోలీస్ స్టేషన్‌లోను అభియోగపత్రాలు అందిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వూరు తారకరామనగర్‌లో అక్రమంగా నిల్వ వుంచి వేన్‌లో తరలిస్తున్న 2.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు మండల సివిల్ సప్లయి అధికారి మమత సూచన మేరకు బియ్యాన్ని వ్యాన్‌లో లోడ్ చేస్తుండగా పట్టుకుని సంబంధిత వ్యక్తులపై ఇంద్రపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

వేసవి వినోదానికి వేళాయె

- డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహణ
- అర్బన్‌లో 25, రూరల్‌లో 25
- 22 క్రీడాంశాల్లో 16 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ
- నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



కాకినాడ జిల్లా క్రీడామైదానం ముఖద్వారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచే ప్రారంభం కావాల్సి ఉన్నా ఈ నెల ఐదో తేదీ వరకు తిరుపతిలో రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్ పోటీలు జరగడం, దాని నిర్వహణకు కోచ్‌లు వెళ్లడంతో ఆదివారానికి వాయిదా వేశారు. స్థానిక డీఎస్‌ఏ ప్రాంగణంలో జిల్లా అధికారులు ఈ పోటీలను ప్రారంభించనున్నారు. డీఎస్‌ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ పర్యవేక్షణలో పట్టణాల్లో 25, గ్రామీణ ప్రాంతాల్లో 25 శిబిరాలు 22 క్రీడాంశాల్లో ప్రారంభం కానున్నాయి. వీటిలో చేరేందుకు 16 ఏళ్ల లోపు బాల బాలికలు అర్హులు. వీరికి ఉదయం 6 నుంచి 8.30 వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 వరకు శిక్షణ అందిస్తారు. అవసరమైన క్రీడా పరికరాలు శిబిరం ప్రారంభంలోనే ఇస్తామని కోచ్, క్రీడా సంఘాల ప్రతినిధుల సమావేశంలో చెప్పినప్పటికీ ఈ పరికరాలు ఇంకా రాకపోవడంతో కార్యక్రమం వాయిదా పడే అవకాశం ఉంది.

బాస్కెట్‌బాల్‌లో జి.మామిడాడ జెడ్పీ హైస్కూల్, సామర్లకోట జెడ్పీ హెచ్‌ఎస్, ఓల్డ్ బస్టాండ్ స్కూల్ పిఠాపురం, బాక్సింగ్‌లో భాష్యం స్కూల్ పిఠాపురం, ఫెన్సింగ్‌లో కాకినాడ రామారావు పేట మున్సిపల్ ప్రైమరీ స్కూల్, ఫుట్‌బాల్‌లో ఎంఎస్‌ఎన్ చారిటీస్, జెడ్పీ స్కూల్ తాటిపర్తి, హ్యాండ్‌బాల్‌లో తాళ్లరేవు జెడ్పీ హైస్కూల్, కాకినాడ ఐడియల్ జూనియర్ కళాశాల, హాకీలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ సాలిపేట, గాంధీనగర్, యు.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్, జూడోలో ప్రభుత్వ పాఠశాల జగ్గంపేట, జెడ్పీ స్కూల్ వాకలపూడి, జెడ్పీ హైస్కూల్ ప్రత్తిపాడు మండలం లంపకలోవ, కబడ్డీలో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల, సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ స్కూల్, ఖో–ఖోలో వీరవరం జెడ్పీ స్కూల్, కరప జెడ్పీ స్కూల్, స్కేటింగ్‌లో తుని డీఎస్‌ఏ స్కేటింగ్ రింక్, సాఫ్ట్‌బాల్‌లో గొల్లపాలెం జెడ్పీ స్కూల్, పెద్దపురం జెడ్పీ స్కూల్‌లో నిర్వహించనున్నారు. తైక్వాండోలో కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ స్కూల్, రాహుల్ తైక్వాండో క్లబ్ వివేకానంద పార్కు, ఇంద్రపాలెం జెడ్పీ స్కూల్, ప్రత్తిపాడు మినర్వా స్కూల్, వాలీబాల్‌లో జి.మామిడాడ జెడ్పీస్కూల్, ఎండపల్లి జెడ్పీ స్కూల్, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏలేశ్వరం ప్రభుత్వ పాఠశాల, వాకలపూడి జెడ్పీ స్కూల్, రెజ్లింగ్‌లో తాళ్లరేవు జెడ్పీ స్కూల్, యోగాలో ఆర్ ఆర్ బీహెచ్‌ఆర్ స్కూల్ పిఠాపురంలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవికాక కాకినాడ డీఎస్‌ఏలో బాస్కెట్‌బాల్, హాకీ, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నీస్, వెయిట్ లిఫ్టింగ్, యోగాథెరపీ, యోగా, జూడో, క్రికెట్, బాక్సింగ్ (క్రీడా వికాస కేంద్రం తుని), అథ్లెటిక్స్‌లో శిక్షణ శిబిరాలు ఈనెల 7వ తేదీ నుంచి మే 31 వరకు నిర్వహించనున్నట్లు డీఎస్‌ఏ ముఖ్య శిక్షకుడు శ్రీనివాస్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ శిబిరాల్లో చేరేందుకు ఆసక్తి గలవారు 89196 42248 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జిల్లాలో శిక్షణ శిబిరాలు ఇవే

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో...
ఆర్చరీ పిఠాపురం భాష్యం స్కూల్.
అథ్లెటిక్స్ వేట్లపాలెం జెడ్పీస్కూల్.
ఆర్‌ఎంసీ గ్రౌండ్స్ కాకినాడ.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి
గృహనిర్మాణ బాట

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహనిర్మాణాలను వేగవంతం చేసేక్రమంలో అధికారులు గృహనిర్మాణ బాట పట్టారు. కార్పొరేషన్, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు చెందిన అధికారులంతా పలు లేఅవుట్లను శనివారం సందర్శించారు. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులతో కలిసి పండూరు లేఅవుట్‌ను సందర్శించి గృహనిర్మాణ ప్రగతిని పరిశీలించారు. హౌసింగ్ ఈఈ గుప్త, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఏఈ బాషా తదితరులు ఆయన వెంట ఉన్నారు. అలాగే నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు అధికారులతో కలసి కొమరగిరి లేఅవుట్‌ను సందర్శించి ఇటుకల పరిశ్రమను పరిశీలించి విద్యుత్‌శాఖ నిర్వహణలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణ ప్రగతిని పర్యవేక్షించారు. ఆయన వెంట హౌసింగ్ డిఈ సత్యనారాయణరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పదింతల ఫలితం సాధించారు

- బాలికలదే పైచేయి..
- విద్యార్థులను అభినందించిన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు



కరప పాఠశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

కరప: మండలంలో పదో తరగతి పరీక్షల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి శనివారం తెలిపారు. మండల పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ వసతి గృహం విద్యార్థులతో కలిపి ఈ యేడాది 835 మంది పరీక్షలు రాయగా 601 మంది పాసై 71.97 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 306 మంది, బాలురు 296 మంది ఉన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వసతి గృహం విద్యార్థులు 52 మందికి 44 మంది ఉత్తీర్ణులు కాగా, 30 మంది ఫస్ట్, 13 మంది సెకండ్ డివిజన్ సాధించారు. మండల పరిధిలో కూరాడ హైస్కూలు 97 శాతం, వేళంగి హైస్కూలు 95.9 శాతం, గురుకుల పాఠశాల 84 శాతంతో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కరప హైస్కూలు 50.7 శాతంతో చిట్టచివరన నిలిచింది. కూరాడ హైస్కూలులో 33 మందికి 32, అరట్లకట్ట హైస్కూలులో 57 మందికి 41 ఉత్తీర్ణులయ్యారు.

నడకుదురు హైస్కూలులో 41 మందికి 22 మంది ఉత్తీర్ణులయ్యారు. కరప హైస్కూలులో 215 మందికి 109 మంది ఉత్తీర్ణులయ్యారు. గొర్రిపూడిలో 77 మందికి 48 మంది పాసవగా, వేములవాడలో 52 మందికి 41మంది, వేళంగిలో 146 మందికి 140 మంది, పెద్దాపురప్పాడులో 89 మందికి 72 మంది, గురజనాపల్లిలో 73మందికి 52 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల పరిధిలో 9 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల ఉండగా 835 మంది పరీక్షలు రాయగా 601 మంది పాసయ్యారు.

పదిలో సత్తా చాటిన బాలికలు

కాకినాడ రూరల్: మండల పరిధిలో గురుకుల పాఠశాల విద్యార్థినులు 91 శాతం ఉత్తీర్ణత సాధించి టాప్‌లో నిలిచారు. మండలంలో 15 ప్రభుత్వ గురుకుల, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో కలిపి 1324 మంది పరీక్షలు రాయగా 701 మంది ఉత్తీర్ణులయ్యారు. 52.94 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలల్లో 1134 మందికి విద్యార్థులకు 1039 మంది ఉత్తీర్ణులై 91.62 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు 59 శాతం, బాలురు 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాల విద్యార్థినులు అత్యధికంగా ఉత్తీర్ణులవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ సుశీల, మురళీకృష్ణ, ఎంఈవో గణేష్‌బాబు వారిని అభినందించారు.

నగర పరిధిలో..

బాలాజీచెరువు: నగర వ్యాప్తంగా మున్సిపల్ ఎయిడెడ్ పాఠశాలలు 25 ఉండగా ప్రైవేట్ స్కూల్స్ 48 వరకూ ఉన్నాయి. పదో తరగతి పరీక్షలకు మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 2442 విద్యార్థులు హాజరుకాగా 1289 మంది ఉత్తీర్ణతతో 52.5 శాతాన్ని సాధించారు. బాలురు 1061 హాజరుకాగా 496 మంది, బాలికలు 1361 హాజరుకాగా 793 మంది ఉత్తీర్ణులైయారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్స్ అర్బన్ డీఐ వాణీకుమారి అభినందించారు.

46 శాతం ఉత్తీర్ణత సాధించిన తూరంగి పాఠశాల

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 46 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. మొత్తం 197 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 92 మంది ఉత్తీర్ణలయ్యారు. ఫస్ట్‌క్లాస్‌లో 48 మంది, సెకండ్ క్లాస్‌లో 27 మంది, థర్డ్ క్లాస్‌లో 17 మంది నిలిచారు.

కేశవానంద భారతి కేసుపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి మాట్లాడుతూ సుప్రీం కోర్టులో 13 మంది జడ్జిలతో కూడిన ధర్మసనంతో చెప్పిన «కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ» కేసు తీర్పు ఇచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలు, మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కి లేదని న్యాయవ్యవస్థ పరిధిలోనే ఉంటుందని ఈ తీర్పులో చెప్పినట్టు తెలిపారు. ఇప్పటి వరకు అటువంటి తీర్పు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి.రామచంద్రరాజు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాస్త్ర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శునకాల సంతతిని నియంత్రించాలి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: శునకాల సంతతి నియంత్రణకు చేస్తున్న ఏబీసీ శస్త్రచికిత్సలు మరింత పెరగాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఈ అంశంపై ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏబీసీ కేంద్రం వైద్యులతో శనివారం సమీక్షించారు. నగరంలో ఎన్ని శునకాలు ఉన్నాయి? ఎన్నింటికి ఆపరేషన్లు చేశారు? ఆపరేషన్లను పెంచేందుకు కావలసిన సౌకర్యాలపై ఆరా తీశారు. డాక్టర్ పృథ్వీ చరణ్ మాట్లాడుతూ గతంలో చేసిన సర్వే ప్రకారం నగరంలో సుమారు 20 వేల శునకాలు ఉంటాయని, 9 వేల శునకాలకు ఆపరేషన్లు చేశామని, రోజుకు పది నుంచి 15 వరకు ఆపరేషన్లు చేస్తున్నామని, అదనపు సిబ్బందిని నియమిస్తే వీటి సంఖ్య పెంచవచ్చని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ పదో తేదీన ఈ అంశంపై పశుసంవర్ధక అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు ఎంజె శ్యామ్, వైద్యులు డాక్టర్ లావణ్య డాక్టర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత నిర్ధారణకు మీటర్లు

కాకినాడ: తాగునీటి నాణ్యతను ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వాటర్ క్వాలిటీ ఎనలైజర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ చెప్పారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్షించారు. నగర పరిధిలో సుమారు 27 రిజర్వాయర్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. సుమారు రూ 7.9 కోట్లతో చేస్తున్న ఈ పనులు ఆగస్టు నాటికి పూర్తికానున్నట్టు తెలిపారు. అలాగే మేకల కబేళా పనులను వేగవంతం చేయాలని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, స్మార్ట్ సిటీ కార్యాలయాల వద్ద ప్రతిపాదించిన సోలార్ విద్యుత్ ప్రతిపాదనలను కూడా వేగవంతం చేయాలని కమిషనర్ సుచించారు.

ప్రతి సమస్యకు పరిష్కారమే లక్ష్యం



ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడను సమస్యల రహిత నగరంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శనివారం స్థానిక 11వ డివిజన్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అధికార పక్షంలో ఉంటూ ప్రజల్లోకి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకునే సంప్రదాయానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఎలాంటి సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చినా పరిష్కరించే సీఎం ఉన్నారని, అందువల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

దిశ డీఎస్పీగా జయరాం ప్రసాద్



కాకినాడ క్రైం: కాకినాడ దిశ డీఎస్పీగా బి.మెహర్ జయరాం ప్రసాద్ నియమితులయ్యారు. 2018 గ్రూప్ అధికారిగా నేరుగా ఎస్‌డీపీవో బాధ్యతలు చేపట్టిన జయరాం ప్రసాద్ స్వస్థలం కాకినాడ జిల్లా. పల్నాడు జిల్లా గురజాల ఎస్‌డీపీవోగా తొలి పోస్టింగ్ చేపట్టిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్నారు. తాజాగా ఆయన కాకినాడ దిశ డీఎస్పీగా నియమితులయ్యారు.

నేడు అల్లూరి శత వర్ధంతి

కాకినాడ కల్చరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని శాస్త్రి కళాపతంలో సీతారామరాజు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు వేదిక వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు ఉదయం 9.30 గంటలకు స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తామని పంపన తెలిపారు.

ఎస్పీని కలసిన శ్యామ్



ఎస్పీ సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న గుంటూరు శ్యామ్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ శుక్రవారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎందరో నిరుద్యోగుల కల నెరవేర్చుతున్న శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యామ్‌ను ఎస్పీ అభినందించారు. ఉత్తమ శిక్షణ ఇస్తూ ప్రతి సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధిస్తున్నారని కొనియాడారు. శిక్షణకు సంబంధించిన పలు విషయాలను ఎస్పీ శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు.

మద్దతు ధర ఇచ్చి ఆదుకోండి




పేపకాయలపాలెంలో కళ్లంలో ఆరపెట్టిన ధాన్యాన్ని ప్రత్యేకాధికారి ప్రద్యుమ్నకు చూపుతున్న రైతులు

- ప్రత్యేకాధికారి ప్రద్యుమ్నకు అన్నదాతల వినతి
- పలు గ్రామాల్లో పంట నష్టం పరిశీలన

కరప: మండలంలోని పేపకాయలపాలెం, కూరాడ గ్రామాల్లో ఇటీవలి వర్షాలకు తడిసిపోయిన ధాన్యపు రాశులను ప్రత్యేకాధికారి పీఎస్ ప్రద్యుమ్న జిల్లా అధికారులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనల మేరకు ఆయన శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి ధాన్యపు రాశులను, మొలకలు వచ్చిన వరి పనలను చూసి రైతులతో మాట్లాడారు. ఎలా ఆదుకుంటే మీ కష్టం తీరుతుందని అడిగిన ప్రశ్నకు రైతులు రైస్ మిల్లు వద్ద ఏ విధమైన కోతలు లేకుండా మద్దతు ధరకు కొనాలని, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా మంజూరు చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని వివరించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ప్రద్యుమ్న హామీ ఇచ్చారు. ఏ మేరకు నష్టపోయిందీ రైతులను అడిగి తెలుసుకున్నారు. జేసీ ఎస్.ఇలక్కియ, జేడీఏ ఎన్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

భావి తరాలకు ఇంధనాన్ని అందిద్దాం




వాహనదారులకు పీయూసీ చెక్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ, ఎస్ఐలు

కాకినాడ సిటీ: ఆయిల్ అండ్ గ్యాస్ సంరక్షణ కార్యక్రమం సాక్షం–2023 ద్వారా వాహనాలకు ఇంధన పొదుపు, పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు గెయిల్ ఇండియా లిమిటెడ్ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందని ఆ సంస్థ డీజీఎం పేరి నాని అన్నారు. స్థానిక బోట్‌క్లబ్ వద్ద నిర్వహించిన ఆయిల్ అండ్ గ్యాస్ సంరక్షణ సాక్షం–2023 ఉచిత పీయూసీ శిబిరాన్ని సీఐ ఆకుల మురళీకృష్ణ, ఎస్సై ఎన్ సతీష్ శనివారం ప్రారంభించారు. రెగ్యులర్ వెహికల్ చెకప్, నిర్వహణ ద్వారా మంచి మైలేజీ పొందవచ్చని, భావితరాలకు ఇంధనాన్ని ఆదా చేయవచ్చని వివరించారు. గెయిల్ సిబ్బంది, సర్పవరం పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు. 375 వాహనాలకు ఉచితంగా పీయూసీ చెక్ చేయించి సర్టిఫికెట్లు అందజేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో కాలువలోకి దిగి ప్రమాదావశాత్తు గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఏకే మల్లవరానికి చెందిన నలుగురు స్నేహితులు కత్తిపూడిలో ఒక డాబా హోటల్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగి తమ గ్రామం చేరుకున్నారు. వారిలో వి.సాయికుమార్ ఎలియాస్ కాశీ గ్రామంలో ఉన్న చెరువు కాలువలోకి కాళ్లు కడుగుకుంటానని దిగాడు. అతను ఎంతకూ బయటకు రాకపోయేసరికి మిగిలిన వారు అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో విషయాన్ని అతని బంధువులు గ్రామస్తులకు తెలిపారు. దీంతో శుక్రవారం అతని కోసం గాలించిన ఫలితం కనిపించలేదు. తిరిగి శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైనట్టు ఆయన తెలిపారు, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

డీఎస్సీ-98 ఉపాధ్యాయులకు శిక్షణ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

కాకినాడ సిటీ: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 98 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణను శనివారం కాకినాడ పీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను డీవైఈఓ జేడీ రాజు ప్రారంభించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకశక్తి పెరిగేలా విద్యాబోధన చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1998 డీఎస్సీలో (మినిమం టైమ్‌స్కేల్) ఉపాధ్యాయులు 460 మంది ఉండగా ఇప్పటి వరకు 310 మంది మాత్రమే విధుల్లో చేరారన్నారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరవల్లి గోపీకృష్ణ, ఎంఈవోలు, ఫెడరేషన్ నాయకులు బోడా క్రిస్టోఫర్, కేవీ రమణమూర్తి తదితరులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.